

రేపటిలోగా బ్యాంకు గ్యారెంటీలు అందించాలి: జేసీ

పార్వతీపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మిల్లర్లు ఈనెల 24లోపు బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వాలని, లేకుంటే బ్లాక్ లిస్టులో పెడతామని జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'లక్ష్యం చేరుకుంటారా?' అనే కథనంపై ఆయన స్పందించారు. అనధికారికంగా మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేసినా, రికార్డులు సరిగా నిర్వహించకపోయినా చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. అక్రమాలకు పాల్పడితే 6ఏ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చెంతనే నది ఉన్నా.. సాగునీటికి అవస్థే!

- భామిని మండల రైతులకు తప్పని ఇక్కట్లు
- ఎత్తిపోతలకు ఎదురుచూపు
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు
- వైసీపీ హయాంలో మంగళం
- కూటమి సర్కారుపైనే ఆశలు



వడ్డంగి లిఫ్ట్ ద్వారా నీరు మళ్లించాల్సిన గజపతిసాగరం ఇదే..

భామిని, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి)

వంశధార నదీతీరాన భామిని మండలం ఉన్నా.. ఈ ప్రాంత రైతులకు సాగునీటి ఇక్కట్లు తప్పడం లేదు. ఏటా వరుణుడిపైనే ఆధారపడి సాగు చేపట్టాల్సి వస్తోంది. వరదల సమయంలో భూములు కోతకు గురవుతుండగా.. వంశధార వరద కాలువలు మండల రైతులకు శాపంగా మారాయి. ఈ సమస్యను పరిగణనలోకి తీసుకున్న గత టీడీపీ ప్రభుత్వం రెండు ఎత్తిపోతల పథకాలను మంజూరు చేసింది. దీంతో అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. అయితే అదే సమయంలో ఎన్నికలు జరగడం.. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సీన్ మారింది. ఈ ఎత్తిపోతల పథకాలన్నింటికీ గత ప్రభుత్వం మంగళం పాడింది. దీంతో ఆ ప్రాంత రైతులకు సాగునీటి సమస్య తీరడం లేదు. లిఫ్ట్ ఇరిగేషన్ కలగానే మిగిలింది. ప్రస్తుతం ఆయా ప్రాంతవాసులు కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు.



వడ్డంగి చెరువులో గుంత తవ్వి పొలాలకు నీటిని మళ్లిస్తున్న రైతులు (ఫైల్)



నేరడిలో పనిచేయని ఎత్తిపోతల పథకం

ఇదీ పరిస్థితి..

- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నేరడి బ్యారేజీ సమీపంలో రూ.33 కోట్లతో ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేశారు. వడ్డంగి గ్రామ సమీపంలో గజపతిసాగరానికి వంశధార నది నీటిని మళ్లించాలనిప్రణాళికలు రూపొందించారు. అక్కడ నుంచి లోహరజోల ఊర చెరువు, వడ్డంగి నల్లచెరువు, కరగాన చెరువు, బొమ్మిక ఎర్ర చెరువు, నులకజోడు, మామిడి చెరువుకు అను సంధానం చేయడం ద్వారా సుమారు ఏడు వేల ఎకరాలు సాగునీరు అందించేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ అధికారులు రంగంలోకి దిగారు.
- కాట్రగడ వద్ద రూ.18 కోట్లతో మరో ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేశారు. అక్కడ నుంచి మనుమకొండ వెర్రిగెడ్డకు వంశధార నీరు మళ్లిస్తే బత్తిలి, కాట్రగడ వద్ద మరో వెయ్యి ఎకరాలకు సాగునీరు అందుతుందని రైతులు ఆశించారు. ఇక పనులు చేపడతారనుకున్న సమయంలో ప్రభుత్వం మారింది. వైసీపీ ప్రభుత్వ తీరుతో వాటి నిర్మాణాలకు బ్రేక్ పడింది. గత ఐదేళ్లు ఆయా ఎత్తిపోతలను పట్టించుకునే వారే కరువయ్యారు.

మూలకు చేరిన మరో పథకం..

ఎన్నో ఏళ్ల కిందట నేరడి సమీపంలో ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం మూలకు చేరింది. జలయజ్ఞంలో భాగంగా వంశధార వరద కాలువ పనులు ప్రారంభించడంతో ఇది (మిగతా 6వ పేజీలో..)

తిరిగొచ్చాయ్!

- 40 రోజుల తర్వాత భామినిలో గజరాజుల హల్‌చల్



భామిని, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): భామిని మండలానికి గజరాజులు తిరిగొ చ్చాయి. సుమారు 40 రోజుల తర్వాత శుక్రవారం రాత్రి ఒడిశా నుంచి మళ్లీ ఈ ప్రాంతానికి చేరుకు న్నాయి. ప్రస్తుతం అవి లివిరి ప్రాం తంలో సంచరిస్తున్నాయి. దీంతో తాలాడ, ఘనసర, కీసర, కోసలి, పసుకుడి ప్రాంత రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు భయపడుతున్నారు. గజరాజుల వల్ల వరి, పత్తి, మొక్కజొన్న పంటలు ధ్వంసమయ్యే అవకాశం ఉందని వాపో తున్నారు. అటవీశాఖా ధికారులు స్పందించి వాటిని తరలించే చర్యలు తీసుకోవాలని వారు కోరు తున్నారు. మరోవైపు పాలకొండ ఫారెస్ట్ రేంజర్ రామారావు లివిరి ప్రాంత వాసులను అప్రమత్తం చేశారు గ్రామాల్లో దండోరా వేయిం చారు. ఏనుగులు ఉన్న ప్రాం తానికి ఎవరు వెళ్లరాదని సూచించారు. 13 మంది ట్రాకర్స్ ఏనుగులను పర్య వేక్షిస్తున్నట్లు వెల్లడించారు. ● కొమరాడ: కురింపేట పరిధిలోనూ మరో ఎనిమిది ఏనుగులు సంచరిస్తున్నాయి. ముమ్మరంగా వరి కోతలు జరుగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

బోగస్ మస్తర్లకు చెక్

- ఈకేవైసీ చేసుకుంటేనే పనుల కల్పన

గరుగుబిల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో బోగస్ మస్తర్ల నిరోధానికి అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇకపై ఈకేవైసీ పూర్తయిన వేతనదారులకే పనులు కల్పించనున్నారు. అయితే ఇప్పటివరకు ఈకేవైసీ చేసుకోని వారికోసం గరుగుబిల్లి మండలంలో శనివారం గ్రామసభలు నిర్వహించారు. జిల్లాలోని 3,82,345 మంది వేతనదారుల్లో 3,80,874 మందికి ఆధార్ అనుసంధానం జరిగింది. 3,80,712 మందికి ఈకేవైసీ పూర్తయింది. గతంలో ఒకరికి బదులు మరొకరు పనులకు హాజరయ్యేవారు. బోగస్ మస్తర్లతో నిధులు పక్కదారి పట్టించేవారు. అయితే ఇకపై అలా కుదరదు. ఈకేవైసీ కాకుండా పనులకు వెళ్తే వేతనాలు అందవు.

నిధుల వినియోగం.. ఇష్టారాజ్యం

- నిబంధనల మేరకు 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించని వైనం
- కొన్నిచోట్ల ఖర్చులన్నీ రికార్డులకే పరిమితం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- ఇదీ పలు పంచాయతీల్లో పరిస్థితి



కొమరాడ సచివాలయం

పార్వతీపురం, నవంబరు22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ పంచాయతీల్లో 15వ ఆర్థిక సంఘం నిధులను నిబంధనల మేరకు వినియోగించడం లేదు. అనధికార పనులకు ఇష్టారాజ్యంగా వెచ్చిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా కొరవడింది. వాస్తవంగా పంచాయతీల్లో జనాభా ప్రాతిపదికన 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూర వుతాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం ఒక్కో వ్యక్తికి రూ.500 చొప్పున కేంద్రం కేటాయిస్తుంది. అయితే జిల్లాలోని చాలా పంచాయతీల్లో అనధికార పనులకు ఇష్టారాజ్యంగా ఆ నిధులు వినియోస్తున్నారు. దీంతో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ నిర్వహణ కష్టతరమవుతోంది. మొత్తంగా ఆశించిన స్థాయిలో అభివృద్ధి పనులు కూడా సాగడం లేదు.

ఇదీ పరిస్థితి..

- కేంద్ర ప్రభుత్వం 2024-25కు సంబంధించి జిల్లాకు రెండు సార్లు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి , ఏప్రిల్ నెలల్లో రూ. 38.73 కోట్లు మంజూరు చేసింది. ఈ మొత్తంతో జిల్లాలోని 451 పంచాయతీల్లో అనేక పనులు చేపట్టాల్సి ఉంది. కానీ అత్యధిక శాతం నిధులు పారిశుధ్య పనులు, కార్మికుల జీతాలకే చెల్లిస్తున్నారు.
- పంచాయతీలకు మంజూరయ్యే 15వ ఆర్థిక సంఘం నిధుల్లో 30 శాతం పారిశుధ్య కార్మి కుల వేతనాలు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్స్ నిర్వహణ, చెత్త తరలించే వాహనాలు మర మ్మతులకు వినియోగించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా మరో 30 శాతం నిధులు తాగునీరు నిర్వహణ, మోటార్లు, పైపులైన్ల మరమ్మతులు, ప్యానెల్ బోర్డుల నిర్వహణ, కొత్త పైపులైన్లు ఏర్పాటు కోసం వెచ్చించనున్నారు. ఎల్ఈడీ దీపాల నిర్వహణ కోసం పది శాతం , విద్యుత్ బిల్లుల చెల్లింపు కోసం మరో పది శాతం నిధులు వినియోగించనున్నారు. మరో 15 శాతం నిధులు అభివృద్ధి లక్ష్యాల సాధన, మొక్కల పెంపకం, ఐదు శాతం గ్రామ సభల నిర్వహణకు ఖర్చు చేస్తున్నట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు.

వినియోగం ఇలా..

- నిబంధనల ప్రకారం నిధులు వినియోగిస్తున్నట్లు అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో భిన్న పరిస్థితి నెలకొంది. ఉదాహరణకు (మిగతా 6వ పేజీలో...)

రోగులకు అండగా హెల్పింగ్ హ్యాండ్స్

- కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి
- మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం



వైద్య శిబిరం ప్రారంభిస్తున్న కలెక్టర్

పార్వతీపురం, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగుల కోసం హెల్పింగ్ హ్యాండ్స్ అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెల్పింగ్ హ్యాండ్స్ పేరుతో జిల్లాలోని అన్ని ప్రధాన ఆసుపత్రుల్లో వలంటీర్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఒక్కో రోగికి ఒక్కో వలంటీర్‌ను అప్పగిస్తామని తెలిపారు. వారు రోగికి ఓపీ తీసుకొని.. తిరిగి ఇంటికి పంపించే వరకు పూర్తి బాధ్యత వహిస్తారన్నారు. 'ఆయుష్మాన్ భారత్' రిజిస్ట్రేషన్ కూడా చేయిస్తారని వెల్లడించారు. జిల్లాలోని మారుమూల గ్రామాల నుంచి వచ్చే గిరిజనులు, నిరక్షరాస్యులు, పేద ప్రజలకు ఆసుపత్రుల్లో ఇబ్బందులు కలగకుండా చూడడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. రోగులు ఆసుపత్రి లోపలకు వచ్చిన దగ్గర నుంచి వైద్యం చేయించుకొని తిరి ఇంటికి వెళ్లేంతవరకు వారికి వలంటీర్లు తోడుగా ఉంటూ మార్గనిర్దేశం చేస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తమ పేర్లను నమోదు చేసుకుని ఈ సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం ఆభా కార్డులను పంపిణీ చేశారు. ఆయన వెంట జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో కె.హేమలత, డీఎంహెచ్‌వో భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దగెడ్డ టు సాలూరు

- తాగునీరు అందించేందుకు చర్యలు
- ప్రాజెక్టును పరిశీలించిన ఇంజనీరు చీఫ్



పెద్దగెడ్డను పరిశీలిస్తున్న పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ చీఫ్

పాచిపెంట, నవంబరు22(ఆంధ్రజ్యోతి): పెద్దగెడ్డ నుంచి సాలూరు మున్సిపాలిటీ వాసులకు తాగునీరందించేందుకు అడుగులు పడుతున్నాయి. ఈ మేరకు శనివారం పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ చీఫ్ ప్రభాకరరావు పెద్దగెడ్డ ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ' 2018లో రూ. 64 కోట్లతో వాటరు స్కీం మంజూరైంది. ఏడు ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్ల పర్ డే) ప్లాంటు ఏర్పాటు నిమిత్తం మళ్లీ ఇప్పుడు రివైజ్ వేసి టెండరు పిలిచాం. సాలూరు మున్సిపాలిటీలో 50 వేల జనాభాకు తాగునీరు కల్పనకు చర్యలు చేపట్టాం. జనాభా ప్రాతిపదికన ఒక వ్యక్తికి 135 లీటర్ల చొప్పున నీరు సరఫరా చేయాల్సి ఉంది. ఇరిగేషన్, రెవెన్యూ, ఆర్అండ్‌బీ శాఖల అనుసంధానంతో సాలూరు సమీపంలోని కాకులతోట వద్ద ఏడు ఎంఎల్‌డీ ప్లాంటు నిర్మిస్తాం. సంక్రాంతి తరువాత పనులు చేపట్టి రెండేళ్లలో పూర్తి చేస్తాం.' అని తెలిపారు. ఈ పరిశీలనలో పబ్లిక్ హెల్త్ సీఈ సుధాకరరావు, ఎస్ఈ కామేశ్వరరావు, ఈఈ జ్యోతి, డీఈఈ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు ఆనుకుని ఉన్నా..

రక్షణ కంచెలు లేవు

- ఇదీ గరుగుబిల్లి మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ల పరిస్థితి

6లో

ఆసుపత్రి పనులు త్వరగా

పూర్తిచేయాలి

- మంత్రి సంధ్యారాణి

6లో


తోటపల్లికి

పోటెత్తిన భక్తులు



యాప్‌తో పర్యవేక్షణ

- గిరిజన విద్యా సంస్థలపై నిఘా
- సమూల మార్పులకు చర్యలు



హెచ్‌పీటీఎస్ యాప్

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యా సంస్థల పనితీరు మెరుగుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ఏఐతో కూడిన హాస్టల్ పెర్ఫార్మెన్స్ మానటరింగ్ సిస్టం (హెచ్‌పీటీఎస్) యాప్‌ను తీసుకొచ్చింది. దీని ద్వారా గిరిజన విద్యా సంస్థలను పర్యవేక్షిస్తూ.. సమస్యలను పరిష్కరించనున్నారు. హాస్టళ్లలో ఎలాంటి పొరపాట్లు, అవకతవకలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోనున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోనున్నారు. జిల్లాలో 77 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, 10 గిరిజన గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, 19 పోస్టుమెట్రిక్ హాస్టల్స్, నాలుగు ఏకలవ్య పాఠశాలలను ఈ యాప్ పరిధిలోకి తీసుకొచ్చారు. ఆయా విద్యా సంస్థల్లో రోజూ చేపట్టే పారిశుధ్యం పనులు, వంట పాత్రల క్లీనింగ్, ఆహారం తయారీ, క్లాస్ రూములు, హాస్టల్ గదుల్లో పరిస్థితి, వాటర్ ట్యాంకులు , మినరల్ వాటర్ ప్లాంట్ల పనితీరు, విద్యార్థుల సిక్ రూమ్‌ల ఫొటోలను తీసి.. నూతన యాప్‌లో వార్డెన్లు అప్‌లోడ్ చేయాల్సి ఉంది. సికిల్ సెల్ ఎనీమియా, క్షయ తదితర వ్యాధులతో బాధపడుతున్న విద్యార్థులకు అందిస్తున్న వైద్యసేవలు, వారి బ్లడ్ గ్రూప్ సమాచారం కూడా ఇందులో నమోదు చేయాల్సి ఉంది. మరుగుదొడ్ల పరిస్థితి, క్లాస్‌రూమ్‌లు కొరత, భవనాల మరమ్మతులు ఇతర సమస్యలను ఈయాప్‌లో నమోదు చేయాలి. రోజువారీ, వారానికొకసారి చొప్పున మరికొన్ని అంశాలను హెచ్‌పీటీఎస్ ద్వారా అధికారులకు తెలియ జేయాలి. వాటిని పరిశీ లించిన అనంతరం నిధులు మంజూరు చేసి మౌలిక వసతులు కల్పిస్తారు. ఈ యాప్‌ను గిరిజన విద్యా సంస్థల ఉన్నతాధికారులు, ఏటీడబ్ల్యూవో, ఐటీడీఏ పీవో తదితరులు పర్యవేక్షించాలి. రాత్రిపూట బస చేసి విద్యా సంస్థల్లో పరిస్థితిని తెలుసుకోవాల్సి ఉంది. ఇప్పటికే జిల్లాలో (మిగతా 6వ పేజీలో...)

రోడ్లకు ఆనుకుని ఉన్నా.. రక్షణ కంచెలు లేవు

● ఇదీ గరుగుబిల్లి మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ల పరిస్థితి

గరుగుబిల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా తయారయ్యాయి. ప్రధానంగా రోడ్లకు ఆనుకుని, పంటపొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచెలు ఏర్పాటుచేయలేదు.పిల్లలు ఆడుకునే సమయంలో అటుగా వెళ్లే ఎటువంటి ప్రమాదాలు జరుగుతాయోనని తల్లిదండ్రులు ఆందోళన చెందు తున్నారు. ట్రాన్స్‌కో అధికారులు దృష్టి సారించి రక్షణ కంచెల చుట్టూ రక్షణ కంచెలు ఏర్పాటుచేయాలని పలువురు కోరుతున్నారు.

●పార్వతీపురం నుంచి పాలకొండ వైపు వెళ్లే మార్గంలో సుంకి సమీపంలో రహదారికి ఆనుకుని ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఇక్కడ మలుపులో ఎటువంటి కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదం నెలకొందని పలువురు చెబుతున్నారు. ఈమార్గంలో అధికంగా రహదారి ప్రమాదాలు నెలకొంటున్నాయి. దీనికితోడు రైతులు పంట పొలాలకు వెళ్లే సమయం లో భయాందోళన చెందుతున్నారు. ●గొట్టివలస ఆర్అండ్‌బీకి ఆనుకుని సచివాలయం ఎదుట, నాగూరులో పంటపొలాలకు ఆనుకుని, ఉద్దవోలు పంటపొలాల మధ్యలో ● బీవీపురంలో రహదారికి ఆనుకుని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణకంచెలు లేకపోవడంతో ప్రజలు, రైతులు భయాందోళన చెందుతున్నారు.



సుంకి వద్ద రహదారికి ఆనుకుని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

తోటపల్లిలో భక్తుల రద్దీ

గరుగుబిల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామ స్వామి దేవస్థానాలకు భక్తుల తాకిడి కొనసాగు తోంది. శుక్ర, శనివారాల్లో భారీగా భక్తులు తరలివ చ్చారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 700 మందికి పైగా భక్తులు తలనీలాలు సమర్పించేందుకు బారులు దీరారు. మొక్కుబడులను చెల్లించుకొనేందుకు వచ్చిన వారితో కేశ ఖండన శాల కిటకిటలాడింది. ఉభయ దేవస్థానాల పరిధిలో ప్రత్యేక పూజలను ఆలయ ప్రధాన అర్చకులు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా దేవస్థానం ఈవో బి.శ్రీనివాస్‌తోపాటు తోటపల్లి దేవస్థానాల అభివృద్ధి సేవా ట్రస్ట్ ప్రతినిధులు చర్యలు చేపట్టారు. భక్తులకు ఉచిత ప్రసాదాలు అందించడంతో పాటు అన్నసమారాధన చేశారు.



స్వామివారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

ఉద్యోగులకు నేత్ర వైద్య పరీక్షలు

బెలగాం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత నేత్ర వైద్య పరీక్షలు శనివారం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీసీహెచ్ నాగ భూషణరావు ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. నేత్ర వైద్యాధికారి జి.నగేష్‌రెడ్డి పర్యవేక్షణలో రెవెన్యూ, ఐటీడీఏ ఉద్యోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో భాస్కరరావు, అంధత్వ నివారణ అధికారి సూర్యకౌశిక్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ పని కల్పిస్తాం: ఎంపీడీవో

వీరఘట్టం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో ప్రతిఒక్కరికీ పని కల్పిస్తామని ఎంపీడీవో బి.వెంకటరమణ తెలిపారు. శనివారం వీరఘట్టం పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కొత్త జాబ్‌కార్డులు మంజూరు చేయడంతోపాటు గతంలోఉన్న వారి పేర్లను మరణిస్తే తొలగిస్తామని, కొత్తగా పనికోరేవారికి దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు.కార్య క్రమంలో ఏపీవో జి.సత్యనారాయణ, ఏవో గిరి జామి లక్ష్మీనారాయణ, తూముల రమేష్ పాల్గొన్నారు.

ఆధార్ తప్పిదాలను సరిచేసుకోవాలి

కొమరాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆధార్ కార్డుల్లో తప్పిదాలు ఉంటే సరిచేసుకోవాలని ఎంపీడీవో రమేష్ సూచించారు. శనివారం కొమరాడ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఆధార్ అప్‌డేషన్ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో నారాయణస్వామి, ప్రిన్సిపాల్ లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరందించాలి

భామిని, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఘనసర పంచాయతీ ఎస్సీ కాలనీలో స్వచ్ఛమైన తాగునీరందించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. శనివారం ఘనసర సచివాలయంలో కార్యదర్శి జగన్నాథానికి లంక శివాజీ, కళ్యాణి సీతారాం, కొప్పర మిన్నారావు, కోటేశ్వరరావు, శంకరరావు తదితరులు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఫ్లోరైడ్ వాటర్ సమస్యతో రెండు సంవత్సరాలు నుంచి ఇబ్బందిపడుతన్నట్లు తెలిపారు.

చిన్నారుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలి

గరుగుబిల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని చిన్నారుల ఆరోగ్యంపై కార్యకర్తలు పర్యవేక్షించాలని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. శనివారం రావివలస సెక్టార్ పరిధిలోని గిజబ, తోటపల్లిల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీచేశారు. అనంతరం పంచాయతీల పరిధిలోని చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శి లలిత, సిబ్బంది పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ తీసుకోవాలి

వీరఘట్టం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఏ-1 పరీక్షల్లో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులకు శ్రద్ధతీసుకోవాలని ఎంఈవో గౌరు నాయుడు కోరారు. శనివారం వీరఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సబ్జెక్ట్‌కాంప్లెక్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిజికల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు జి.లక్ష్మణరావు తయారుచేసిన సైన్స్ మోడల్ పేపర్ పుస్తకాలను ఆవిష్కరించారు.

తిత్తిరిలో కుష్ఠు వ్యాధిగ్రస్థుల గుర్తింపునకు సర్వే

కురుపాం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నీలకంఠాపురం పీహెచ్‌సీ సిబ్బంది తిత్తిరి పంచాయతీ ఎగువ కీడవాయి గ్రామంలో కుష్ఠు వ్యాధిగ్రస్థుల గుర్తింపునకు సర్వే కార్యక్రమం చేపట్టారు. వ్యాధి లక్షణాలు గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో శ్రీహరిరావు, సిబ్బంది జగన్నాథం, రమాదేవి, రోషిణి పాల్గొన్నారు.

వంద మందికి దుప్పట్ల పంపిణీ

వీరఘట్టం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం శ్రీసత్యసాయిబాబా మందిరంలో శనివారం సత్యసాయిబాబా శత జయంతి పురస్కరించుకుని వందమందివృద్ధులకు దుప్పట్లు పంపిణీచేశారు.కార్యక్రమంలో సత్యసాయి బాబా వీరఘట్టం కన్వీనర్ మురళి, సన్యాసినాయుడు, భాస్కరరావు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో జీవనశైలి వ్యాధుల దూరం

● జిల్లా ఎన్‌సీడీ అధికారి డాక్టర్ జగన్మోహన్‌రావు

పార్వతీపురం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత, ఆరోగ్యకర జీవనశైలితో వ్యాధులు దరిచేరవని జిల్లా ఎన్‌సీడీ అధికారి డాక్టర్ జగన్మోహన్ రావు తెలిపారు. శనివారం వెంకంపేటలో వైద్య బృందంతో కలిసి సందర్శించారు. గ్రామస్థులతో మాట్లాడి ఆరోగ్యసమాచారం, అందుతున్న వైద్యసేవలపై అడిగి తెలుసుకున్నారు. సంచార చికిత్సశిబిరం ద్వారా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు తనిఖీనిర్వహించాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ డ్రైడే పాటించడంవల్ల దోమల ద్వారా వచ్చే రోగాలను అరికట్టవచ్చని పేర్కొన్నారు. అనంతరం వెల్‌నెస్ కేంద్రంలో సిబ్బందితో సమీక్షించి ఆరోగ్య సర్వేలపై ఆరాతీసి ఆన్‌లైన్‌నమోదులో పురోగతిని పరిశీలించారు. కార్యక్రమంలో సహాయ జిల్లా మలేరియా అధికారి సూర్యనారాయణ, విస్తరణాధికారి వాసుదేవరావు, శ్రీరాములునాయుడు, పర్యవేక్షకులు జయగౌడ్, నాగమ్మ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దుచేయాలి

పాలకొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. శనివారం పాలకొండలో సీఐటీయూ ఆధ్వర్యంలో అమలుకు ఇచ్చిన లేబర్ కోడ్‌లు ఉత్తర్వుల కాపీలను దహనం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పాలకొండ మండల కార్యదర్శి కాద రాము, రైతు సంఘం నాయకులు, అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు, భవన నిర్మాణ కార్మికులు ఎస్.గంగరాజు, ఎం.సత్యనారాయణ, సీహెచ్ శంకరరావు, ఆర్.ప్రసాద్, ఎ.ప్రసాద్ పాల్గొన్నారు.

●భామిని, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్‌కోడ్‌లను ఉపసంహరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. శనివారం భామినిలో నిరసన తెలిపారు. అనంతరం లేబర్‌కోడ్‌లకు సంబంధించి పత్రాలను దహనం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూనాయకులు అప్పలస్వామి, జగన్నాయకులు, పద్మమ్మ, ప్రజాసంఘాల నాయకులు మిన్నారావు, కాంతారావు పాల్గొన్నారు.



భామిని: లేబర్‌కోడ్‌ల పత్రాలను దహనం చేస్తున్న నాయకులు

ఆసుపత్రి పనులు పూర్తిచేయాలి

●ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు: మంత్రి సంధ్యారాణి



శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):నాణ్యతకు రాజీలేకుండా ఆసుపత్రి పనులు త్వరగా పూర్తిచేయాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశించారు. గత ప్రభుత్వంలో నిలిచిపోయిన పనులను కూటమి ప్రభుత్వం వేగవంతం చేస్తోందని తెలిపారు. శనివారం పట్టణంలోని నిర్మాణంలో ఉన్న వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సంధ్యారాణి సందర్శించారు. ఆసుపత్రి పనుల పురోగతిపై కాంట్రాక్టర్లు, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.సాలూరు పీహెచ్‌సీలో ట్రైనింగ్ పూర్తిచేసిన స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలకు సర్టిఫికెట్లు అందజేశారు.

పనులు వేగవంతం చేయాలి

సాలూరు మునిసిపాలిటీలో జరుగుతున్న పలు పనులు వేగవంతంగా చేయాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు.సాలూరు మునిసిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్షించేందుకు మునిసిపల్ ఈఎన్‌సీ అధికారులు శనివారం సంధ్యారాణిని కలిశారు. ఈ సందర్భంగా ఈఎన్‌సీ అధికారులు తక్షణమే మునిసిపాలిటీ ప్రాజెక్టులను సమగ్రంగా పరిశీలించి అన్నిపనులను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. పట్టణ ప్రజలకు శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికోసం ప్రభుత్వం రూ.100 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు ఆమోదించినట్లు తెలిపారు. అవసరమైన ప్రక్రియలు పూర్తిచేసి త్వరలో శంకుస్థాపన నిర్వహించేలా అన్ని ఏర్పాట్లుచేస్తున్నామని మంత్రికి చెప్పారు. సాలూరు అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి పనిని నాణ్యతతో ముందుకు తీసుకెళ్లేలా కఠినంగా పర్యవేక్షిస్తామని చెప్పారు. భేటీలో ఈఎన్‌సీ సీఈవో ఎం.ప్రభాకర్, ఈఈ, డీహెచ్‌వో, మునిసిపల్ డీఈ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్: విప్

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పేర్కొన్నారు. శనివారం గుమ్మలక్ష్మీపురంలోని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. భూ సమస్యలు పరిష్కరించాలని, ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు చేసి తమను ఆదుకోవాలని, మంచినీటి సౌకర్యం కల్పించాలని వినతులు అందించారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న జగదీశ్వరి

ఎల్విన్‌పేటలో ఇరుముడి పూజలు

గుమ్మలక్ష్మీపురంలోని ఎల్విన్‌పేట రామాలయంలో గల అయ్యప్పస్వామి సన్నిధిలో ఇరుముడి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కుటుంబ సభ్యుల అయ్యప్పదీక్ష పురస్కరించుకుని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి మహిళలతో కలిసి నేలపై కూర్చొని అయ్యప్పస్వామి ఇరుముడి కార్యక్రమాన్ని తిలకించారు.

టీడీపీ అభివృద్ధికి కృషి చేయండి: ఎమ్మెల్యే

పార్వతీపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి టీడీపీ కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కోరారు. శనివారం బలిజిపేట మండలంలోని అరసాడ గ్రామంలో టీడీపీ కార్యాలయానికి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను గ్రామస్థాయి కార్యకర్తలే ముందుడి నడిపించాలన్నారు. కార్య క్రమంలోటీడీపీ మండలాధ్యక్షుడు వేణుగోపాల్‌నాయుడు, అరకు బీసీ సెల్ అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, రెడ్డి సత్యనారాయణ, కళ్లెంపూడి సింహాచలం, బాబ్జీ, గొల్ల సింహాచలం, మరిశెర్ల చిన్నంనాయుడు పాల్గొన్నారు.



పార్వతీపురం రూరల్: వినతిని పరిశీలిస్తున్న విజయచంద్ర

●పార్వతీపురం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.

కలెక్టర్ చొరవతో విద్యార్థినికి వైద్యం

పార్వతీపురం, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి చొరవతో ఓ విద్యార్థినికి విశాఖలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి.. మెరుగైన వైద్యం అందిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. పాచిపెంట మండలం కూనంబం దవలసకి చెందిన కోట హాసిని కేశలి పాఠశాలలో నాలుగో తరగతి చదువుతుంది. కొద్దిరోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆ బాలికను కుటుంబసభ్యులు విజయనగరం ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. పరిస్థితి మెరగకపోవడంతో విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. విద్యార్థినికి వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు లివర్‌ట్రాన్స్‌పరేషన్ అవసరమని తేల్చారు. సంబంధిత అధికారుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టు ద్వారా వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం బాలికను విశాఖలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



విశాఖలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కురుపాం, నవంబరు22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వ్యసనాలకు బానిస కాకుండా చదువుపై శద్ధ కనపరచాలని కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు కోరారు. శనివారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో మత్తుపదార్థాల వాడకం వల్ల వచ్చే దుష్ప్రభావాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● సీతానగరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఎల్.దాలినాయుడు ఆధ్వర్యంలో సీతానగరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.పద్మావతి, సబ్ ఇన్‌స్పెక్టర్ కె.మురళీలు మత్తు పదార్థాలు సేవించడం వల్ల కలిగే అనర్థాలపై శనివారం అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలు ఎక్కడైనా క్రయవిక్రయాలు జరిగినా, రవాణాకు పాల్పడుతున్నట్లు తెలిసినా వెంటనే తమకు తెలియజేయాలని కోరారు.

మన్యంలో అప్రమత్తం

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులు ఆదివారం దేశ వ్యాప్తంగా బందుకు పిలుపుఇచ్చిన నేపథ్యంలో మన్యం జిల్లా గిరిజన ప్రాంతంలో పోలీస్‌శాఖ అప్రమత్తమైంది. పోలీసులు ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల్లో వాహనాలను తనిఖీచేస్తున్నారు. ఎస్ఐ హరి నేతృత్వంలో తనిఖీలు ముమ్మరం చేశారు. సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు.

నేడు దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

గరుగుబిల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వరస్వామి, కోదండరామ స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం ఆదివారం జరగనుంది. దేవస్థానం ఈవో బి.శ్రీనివాస్, దేవస్థానాల అభివృద్ధి సేవా ట్రస్ట్ ప్రతినిధి డాక్టర్ డి.పారినాయుడు, ఎం.వాసుదేవరావు ఏర్పాట్లుచేశారు. ఛైర్మన్‌గా తోటపల్లికి చెందిన మార్కొండ పకీరునాయుడుతో పాటు మరో 11 మంది ధర్మకర్తల మండలి సభ్యులు ప్రమాణం చేయనున్నారు.

రేపు మండల సమావేశం

గరుగుబిల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి.పైడితల్లి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఉరిటి రామారావు అధ్యక్షతన జరగనున్న సర్వసభ్య సమావేశానికి అధికారులు సమాచారంతో హాజరుకావాలని కోరారు.

చెత్త సేకరణపై అవగాహన

సాలూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సాలూరులోని పారిశుధ్య కార్మికులకు శనివారం ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ ఆధ్వర్యంలో చెత్తను గృహాల నుంచి సేకరించడం, వాటిని తడి, పొడి వ్యర్థాలుగా వేరచేయడం, డంపింగ్ యార్డుకు రవాణా చేయడం, వ్యక్తిగత భద్రత పరికరాల ఉపయోగాలు, వినియోగించే క్రమంలో ఎదుర్కొనే సమస్యలను పరిష్కార మార్గాలపై రిసోర్సు పర్సన్ ఎల్.వెంకటేశ్వరరావు అవగాహన కల్పించారు. మునిసిపల్ మేనేజర్ బీఎం.ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్.బాలకృష్ణ పాల్గొన్నారు.

పాఠ్యాంశాలు పూర్తిచేయాలి

కొమరాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జడ్పీ పాఠశాలల్లో డిసెంబరు ఐదో తేదీ లోగా పదో తరగతి పాఠ్యాంశాలను పూర్తి చేయాలని ఎంఈవో జామి నారాయణ స్వామి ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం కొమరాడ జడ్పీపాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల పరిశుభ్రతలపై ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు

మక్కువ రూరల్, నవంబరు 22 ఆంధ్రజ్యోతి):మండలంలోని చెముడులో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. టీడీపీ మండలాధ్యక్షుడు గుల్లవేణుగోపాలనాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోపాల కృష్ణమూర్తి, సర్పంచ్ భీమేశ్వరరావు, ఆర్ఐ కె.శ్రీనివాసరావు, వెంగలరాయసాగర్ వైస్‌చైర్మన్ పెంట సత్యం పాల్గొన్నారు.

చెంతనే నది ఉన్నా.. సాగునీటికి అవస్థే!

(ఐదో పేజీ తరువాయి)

పనికిరాకుండా పోయింది. దీనిని పునరుద్ధరిస్తే గురండి, నేరడి గ్రామాల్లోని సుమారు 200 ఎకరాలకు సాగునీరు అందుతుంది. దీనిపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించాలని ఆయా ప్రాంతవాసులు వేడుకుంటున్నారు. దీనిపై లిఫ్ట్ ఇరిగేషన్ డీఈ కామరాజును వివరణ కోరగా.. ' భామిని మండలంలో ఎత్తిపోతల పథకాలకు తిరిగి అంచనాలు రూపొందిస్తున్నాం. ప్రస్తుతానికి నేరడిలో ఉన్న ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించి రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపడతాం. ' అని తెలిపారు.

పూర్తిస్థాయిలో నీరివ్వాలి..

గతంలో మంజూరైన ఎత్తిపోతల పథకాల పనులు ప్రారంభించాలి.భూములకు సాగునీరివ్వాలి. అప్పుడు ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుంది. అధికారులు స్పందించాలి.

-వి.శేషగిరినాయుడు, రైతు, వడ్డంగి

ఎత్తిపోతలే ఆధారం..

ఎత్తిపోతల పథకం ద్వారా వడ్డంగి గజపతి సాగరానికి వంశధార నది నీరు మళ్లిస్తే.. నులకజోడు మామిడి చెరువుకు సాగునీరు అందుతుంది. ఈ ప్రాంతంలో సాగునీటి కష్టాలు తీరుతాయి. ప్రస్తుతం మాకున్న భూములకు ఎత్తిపోతల పథకమే ఆధారం.

-భూపతి ప్రభాకరరావు, రైతు, నులకజోడు

యాప్‌తో పర్యవేక్షణ

(5వ పేజీ తరువాయి)

అధికారులు హెచ్‌పీటీఎస్ యాప్ ద్వారా సమాచారం సేకరిస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. దీనిపై భద్రగిరి గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ యుగంధర్‌ను వివరణ కోరగా.. ' హెచ్‌పీటీఎస్ యాప్‌ను గత రెండు రోజుల నుంచి వినియో గిస్తున్నాం. విద్యార్థుల ఆరోగ్యం, మెనూ అమలు, పారిశుధ్యం తదితర సమాచారాన్ని ఏరోజుకారోజు ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం. ఉన్నతాధికారులు వాటిని పరిశీలిస్తారు. ' అని తెలిపారు.

పనితీరు మెరుగుకు చర్యలు

గిరిజన విద్యా సంస్థల పనితీరు పూర్తిస్థాయిలో మెరుగుపర్చడానికి అన్ని చర్యలు తీసుకుం టున్నాం. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో హెచ్‌పీటీఎస్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేశాం. దాని ద్వారా గిరిజన విద్యా సంస్థలను కలెక్టర్, ఇతర అధికారులంతా ప్రత్యేక శ్రద్ధతో పరిశీలిస్తున్నారు.

- యశ్వంత్‌కుమార్‌రెడ్డి, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో, పార్వతీపురం

నిధుల వినియోగం.. ఇష్టారాజ్యం

(5వ పేజీ తరువాయి)

గ్రామసభల నిర్వహణకు ఐదు శాతం నిధులు వెచ్చించాల్సి ఉంది. అయితే చాలా పంచాయతీల్లో ఉన్నతాధికారులు ఆదేశిస్తే తప్ప గ్రామసభలు నిర్వహించడం లేదు. తాగునీటి ట్యాంకులు నిర్వహణ అంతంతమాత్రంగానే ఉంది. కాలువల నిర్వహణ ఏడాదికి రెండు లేదా మూడుసార్లు మాత్రమే చేపడుతున్నారు.

● పంచాయతీలకు మంజూరవుతున్న నిధులు ఏ మాత్రం సరిపోవడం లేదని కొంతమంది అధికారులు చెబుతున్నారు. అయితే ఆయా నిధులతో క్షేత్రస్థాయిలో చేపడుతున్న పనులపై వారి పర్యవేక్షణ కొరవడిందనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

● కొమరాడ పంచాయతీలో సుమారు రూ.20 లక్షలకు పైబడి 15వ ఆర్థిక సంఘం నిధులను ఇష్టారాజ్యంగా ఖర్చు చేశారన్న ఆరోపణలున్నాయి. దీనిపై ఇప్పటికే సర్పంచ్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చారు. అయితే అధికారుల పర్యవేక్షణ ఉంటే ఇలా జరిగేనా? అన్నది చర్చనీయాంశమవుతోంది.

● క్లాప్ మిత్రలు, విద్యుత్ చార్జీల బిల్లుల చెల్లింపులకు 15వ ఆర్థిక సంఘం నిధులు వెచ్చిస్తున్నట్లు కొన్ని పంచాయతీలు చెబుతున్నప్పటికీ అవన్నీ కాగితాల వరకేనన్న వాదనలు లేకపోలేదు.

● అనధికార ఖర్చులు కూడా పంచాయతీల ఖాతాల్లో నమోదు చేస్తున్నట్లు తెలుస్తోంది. పంచాయతీల సందర్శన లేదా ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగిస్తున్న పరిస్థితి ఉంది.

నిబంధనల ప్రకారమే వినియోగం

నిబంధనల ప్రకారం పంచాయతీల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు వెచ్చిస్తున్నాం. ఇతర పనులకు ఆ నిధులను వినియోగిస్తున్నట్లు వస్తున్న ఆరోపణల్లో నిజం లేదు. కొమరాడలో ఇష్టారాజ్యంగా 15వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చు పెట్టారన్న ఆరోపణపై విచారణ చేశాం. సర్పంచ్‌కు షోకాజ్ నోటీసు అందించాం.

- కొండలరావు, డీపీవో, పార్వతీపురం మన్యం

నేటి నుంచి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు

విజయనగరం టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విజ్జీ స్టేడియంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలు జరగనున్నాయి. ఆదివారం మధ్యాహ్నం 4 గంటలకు ఈ పోటీలు విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, కలెక్టర్ రామ సుందర్ రెడ్డి, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా విద్యాశాఖాధికారి యు.మాణిక్యంనాయుడు ఈ పోటీలను ప్రారంభించనున్నారు.

నేడు సత్యసాయి జయంత్యుత్సవం

విజయనగరం కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విజయనగరం స్టేడియం కాలనీ సమీపంలోని ఓం మందిరంలో ఆదివారం సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. బాబా జయంతిని రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో జరిగే ఉత్సవాలకు జిల్లా అధికారులు, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల పర్యవేక్షకులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

గజపతినగరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 24 వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ప్రథమ సంవత్సరం బీఏ, బీకాం, బీఎస్సీ గ్రూప్‌లో స్పాట్ అడ్మిషన్లు కొనసాగుతున్నాయని, అర్హత కలిగిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు గురజాడ గ్రంథాలయంలో సెమినార్

విజయనగరం దాసన్నపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గురజాడ కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు సెమినార్ నిర్వహించనున్నట్లు నిర్వహకుడు ఆర్ఎస్ రెడ్డి, విద్యార్థి జేఏసీ నాయకుడు రామ్‌శ్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్-1, 2 సాధించడం ఎలా? కరెంటు అఫైర్స్, పర్యావరణం, జీవవైవిధ్యం, ఇండియన్ ఎకానమి బేసిక్స్ అనే అంశాలపై ఈ సెమినార్ నిర్వహించనున్నట్టు తెలిపారు. హాజరైన విద్యార్థులకు పర్యావరణం, టెక్నాలజీ పుస్తకాన్ని ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8374315777, 9491601342 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

కొత్త భవనంలోకి వసతి గృహం

విజయనగరం టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహారాణిపేటలో నిర్వహిస్తున్న కళాశాల బాలికల వసతి గృహాన్ని తక్షణమే కొత్త భవనంలోకి మార్చాలని పీడీ విమలారాణి ఆదేశించారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన శిథిల భవనంలో హాస్టల్ కథనంపై ఆమె స్పందించారు. నెల రోజులుగా నూతన భవనం కోసం వెతుకుతున్నట్లు వసతిగృహ సిబ్బంది పీడీకి చెప్పగా.. వేగంగా ఆ పని చేయాలని వారికి ఆదేశించారు.

ఫిబ్రవరిలో పోలిపల్లి పైడితల్లి జాతర

రాజాం రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పోలిపల్లి పైడితల్లి అమ్మవారి 100వ జాతర మహోత్సవాలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 23 నుంచి 25 వరకూ మూడురోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ మేరకు దేవదాయ శాఖ అధికారులు, వంశపారంపర్య ధర్మకర్త, ఎస్వీఆర్ కళాపరిషత్ అధ్యక్షులు, తదితరులు జాతర తేదీలను ఖరారు చేశారు. మారుజాతర విషయంలో ఇంకా స్పష్టత రాలేదు.

మహాసభలను విజయవంతం చేయాలి

విజయనగరం దాసన్నపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గీత కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని యాత సంఘం అధ్యక్షుడు అంగటి రాము పిలుపునిచ్చారు. శనివారం స్థానిక అమర్‌భవన్‌లో మహాసభల ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. డిసెంబరు 1న గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మహా సభలు జరుగుతాయని, గీత కులాలకు చెందిన వారంతా హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభలో గీత కులాల సంక్షేమంపై కార్యచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, అప్పారావు, ఫణికుమార్ పాల్గొన్నారు.

25న మినీ క్రిస్మస్ వేడుకలు

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గురజాడ కళాక్షేత్రం ఓపెన్ ఆడిటోరియంలో ఈ నెల 25న నిర్వహించనున్న మినీ క్రిస్మస్ వేడుకలను విజయవంతం చేయాలని యేసు ప్రేమాలయం పాస్టర్ అలజంగి రవికుమార్ అన్నారు. శనివారం యేసు ప్రేమాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో వివేక్ స్టీఫెన్, మనోహర్, సునీల్, సువార్తమ్మ, షాలినీ, యబోజ్ చౌదరి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభం

జామి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అన్నంరాజుపేట పీఏసీఎస్‌లో శనివారం ధాన్యం కొనుగోలు ప్రారంభమయ్యాయి. రైతులు దళారుల మాటలు నమ్మకుండా ప్రభుత్వానికి ధాన్యం ఇవ్వాలని, 24 గంటల్లో డబ్బులు మీ బ్యాంకు ఖాతాలకు జమ అవుతాయని పీఏసీఎస్ చైర్మన్ ఎన్నింటి అప్పలరాజు తెలిపారు. కార్య క్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు స్వామినాయుడు, ఏవో పూర్ణిమ, ఎంపీడీవో అప్పలనాయుడు, జామి పీఏసీఎస్ అధ్యక్షుడు వర్మరాజు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

● మంత్రి కొండపల్లి

విజయనగరం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. శనివారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, రాష్ట్ర మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజుతో కలిసి ప్రజలను నుంచి వినతులు స్వీకరించారు. సామాజిక పింఛన్లు, ఇళ్లు, రుణాలు మంజూరు చేయాలని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ పలువురు వినతులు ఇచ్చారు. వినతులు పరిశీలించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఈ సమస్యలను దశలవారీగా పరిష్కరించనున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామన్నారు. పార్టీ ఆదేశాల మేరకు శనివారం మంత్రి శ్రీనివాస్ వినతులు స్వీకరించారని తెలిపారు.


వినతులు స్వీకరిస్తున్న మంత్రి కొండపల్లి

ప్రతి ఒక్కరికీ ప్రేమను పంచుదాం

ఎస్.కోట రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి పంచిన ప్రేమను సేవ రూపంలో ప్రతి ఒక్కరికీ పంచుదామని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అన్నారు. శనివారం చినఖండేపల్లి సాయి దివ్యామృతంలో నిర్వహించిన సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ ఆధ్వర్యంలో గిరిజనులకు దుప్పట్లు, విద్యార్థులకు విద్యాసామగ్రి అందించారు. నిర్వాహకుడు కుమార్‌ను అభినందించారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

రాజాం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) కార్మికులు, ఉద్యోగులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బి.వాసుదేశరావు డిమాండ్ చేశారు. లేబర్ కోడ్స్‌పై కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం పొనుగుటివలస కూడలి వద్ద నాలుగు లేబర్ కోడ్స్ జీవో ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటిస్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తెస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం దారుణం అన్నారు. వీటిని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.సురప్రస్, జిల్లా కార్యదర్శి ఎం.త్రినాథ్, నాయకులు పాల్గొన్నారు.

●రాజాం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక కార్యదర్శి రామ్మూర్తినాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్ సమీపంలో రాస్తారోకో నిర్వహించారు. పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.


జీవో ప్రతులను దహనం చేస్తున్న సీఐటీయూ నేతలు

●నెల్లిమర్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నాలుగు లేబర్ కోడ్లు రద్దుచేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను వ్యతిరేకిస్తూ శనివారం స్థానిక విద్యుత్ జిల్లా స్టోర్స్ వద్ద హమాలీలు నిరసన వ్యక్తం చేశారు. జీవో కాపీలు దహనం చేశారు. కార్యక్రమంలో విద్యుత్ హమాలీ సంఘం నాయకులు పతివాడ లక్ష్మణరావు, మీసాల లెనిన్, కలిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

కొత్త జాబ్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

చీపురుపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొత్త జాబ్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ఐ. సురేష్ సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం జరిగిన గ్రామ సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాన్ని విడిచి వెళ్లిన వారి జాబ్ కార్డులు తొలగించి, అర్హులైన వారికి కొత్తకార్డులు జారీ చేయాలన్నారు. జాబ్ కార్డులు పొందిన వారికి మాత్రమే ఉపాధి హామీ పథకంలో పనులు కల్పిస్తామన్నారు. జాబ్ కార్డుల తొలగింపునకు గ్రామ సభల్లో ఆమోదం తెలిపారు. ఈ గ్రామ సభల్లో ఏపీవో ఆదిబాబు, టీఏ, ఫీల్డ్ సహాయకులు పాల్గొన్నారు.


రేగిడి: బూరాడ సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ చంద్రకుమారి

●రేగిడి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన ఉపాధి వేతనదారుల జాబ్‌కార్డులను తొలగించి కొత్తవారికి వాటిని మంజూరు చేయాలని రాజాం ఏపీడీ చంద్రకుమారి అన్నారు. మండలంలో 39 గ్రామ పంచాయతీల్లో శనివారం ఉపాధి పనులు గుర్తింపుపై గ్రామసభలు నిర్వహించారు. బూరాడలో నిర్వహించిన గ్రామసభను వైస్ఎంపీపీ వి.జగన్మోహనరావుతో కలిసి ఏపీడీ పర్యవేక్షించి మాట్లాడారు. కొంతమందికి ఉపాధి కార్డులు లేకపోవడంపై ఆమె స్పందించారు. పుర్లిలో నిర్వహించిన గ్రామసభను ఏపీవో హరనాథ్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ చిన్నంనాయుడు, నాగభూషణరావు, శంకర్ పాల్గొన్నారు.

●నెల్లిమర్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ కొత్త జాబ్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఏపీవో రామారావు సూచించారు. అన్ని పంచాయతీల్లో శనివారం ఉపాధిహామీపై గ్రామ సభలు నిర్వహించారు. చనిపోయిన వారి జాబ్‌కార్డులను తొలగించాలని సిబ్బందికి ఆదేశించారు. అలాగే పనుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏపీవో సూచించారు. క్షేత్రసహాయకులు, టీఏలు పాల్గొన్నారు.

●లక్కవరపుకోట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అర్హులైన వారికి కొత్త జాబ్‌కార్డులు మంజూరు చేసేందుకు శనివారం ఏపీవో విజయలక్ష్మి ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. ఈకేవైసీ పరిశీలన అనంతరం చనిపోయినవారిని, పూర్తిగా గ్రామం విడిచి వెళ్లిన వారిని తొలగించి కొత్తవారికి అవకాశం కల్పిస్తున్నట్టు చెప్పారు. తొలగించిన పేర్లు, అర్హుల పేర్లు గ్రామసభల్లో చదివి ఆమోదించినట్లు ఏపీవో తెలిపారు. ఇంకా ఎవరైనా జాబ్‌కార్డులు కావాలంటే తమను సంప్రదించాలని పేర్కొన్నారు.

సాహిత్యానికి పుట్టినిల్లు విజయనగరం

నెల్లిమర్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సాహిత్యానికి పుట్టినిల్లు విజయనగరం అని, ఇక్కడ మహాకవి గురజాడ వంటి మహానుభావులు పుట్టారని సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్ రావు కొనియాడారు. 1904లో సాహిత్యంలో నోబెల్ బహుమతి పొందిన స్పెయిన్ రచయిత జోస్ ఎచేగరే రాసిన నాటకాన్ని ప్రముఖ రచయిత పూలబాల వెంకట్ ప్రసాద్ తెలుగులో ఏ దేశమేగినా అనే పేరుతో అనువదించారు. శనివారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ డీఎస్.రావు ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పెయిన్ సంస్కృతి, భారతీయ సంస్కృతికి దగ్గరగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్.రాజు, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంతకుమార్ మహంతి, రిజిస్ట్రార్ పల్లవి, రాజశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఎన్‌రావు తదితరులు

మాక్ అసెంబ్లీకి జరజాపుపేట విద్యార్థి ఎంపిక

నెల్లిమర్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 26న రాష్ట్ర అసెంబ్లీలో జరగనున్న విద్యార్థుల మాక్ అసెంబ్లీ సమావేశానికి జరజాపుపేట ఉన్నత పాఠశాలకు చెందిన కాళ్ల లోహేంద్ర ఎంపికయ్యాడు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. లోహేంద్రను నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, ఏఎంసీ డైరెక్టర్ ఎంఎం.నాయుడు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ కాళ్ల సత్యవతి, హెచ్ఎం నుసర్ల కామేశ్వరి, ఉపాధ్యాయులు అభినందించారు.


లోహేంద్ర

ఎన్‌జీవో అసోసియేషన్ ఎన్నికకు నోటిఫికేషన్

నెల్లిమర్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నెల్లిమర్ల తాలుకా యూనిట్ కార్యవర్గ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా సంఘం నాయకుడు వై.ఆనంద్‌కుమార్ వెల్లడించారు. నెల్లిమర్లలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల అధికారిగా తనను, సహాయ ఎన్నికల అధికారిగా ఎం.శ్రీనివాసరావును జిల్లా నాయకత్వం నియమించిందన్నారు. ఈ నెల 26 ఉదయం 10గంటల నుంచి 12 వరకు నామినేషన్ స్వీకరణ, డిసెంబరు 3న ఎన్నిక జరుపుతామని తెలిపారు. నెల్లిమర్ల, గుర్ల మండలాల్లోని గెజిటెడ్, నాన్‌గెజిటెడ్ ఉద్యోగులందరూ పాల్గొనాలని కోరారు.

సారిపల్లి మత్స్యకార సొసైటీ అధ్యక్షుడిగా పాపారావు

నెల్లిమర్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సారిపల్లి పరదేశమ్మ స్వదేశీ మత్స్యకార సొసైటీ అధ్యక్షుడిగా సింగిడి పాపారావు, ఉపాధ్యక్షుడిగా సింగిడి దేశీ ఎన్నికయ్యారు. శనివారం ఆ గ్రామంలో జరిగిన ఈ ఎన్నిక అధికారులుగా మత్స్యశాఖ అధికారి పి.జానకి, నవాజ్ సరిఫ్ వ్యవహరించారు. సొసైటీ డైరెక్టర్లుగా పొలిపి నరసింహులు, తాటిపూడి చిన్నారావు, గంద్రేటి గౌరి, ఆకిరి కృష్ణ, సిద్ధాంతం గౌరి ఎన్నికయ్యారు. వీరిని మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఏపీ మార్క్ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగారాజు తదితరులు అభినందించారు.

స్వయం ఉపాధితో ముందుకు నడవాలి

రేగిడి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్‌హెచ్‌జీ గ్రూపులు తీసుకున్న బ్యాంక్ లింకేజ్, ఇతర రుణాలతో స్వయం ఉపాధితో ముందుకు నడవాలని డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి సూచించారు. కొత్తచెలిగానవలస, అంబఖండి, రేగిడి గ్రామాల్లో శనివారం సంఘాలకు ఇస్తున్న రుణ పరపతి, వాటి వినియోగం, స్వయం ఉపాధిపై ఆమె క్షేత్రస్థాయిలో ఆరాతీశారు. రుణాల రికవరీ, స్వయం సమృద్ధిపై సంతృప్తివ్యక్తంచేశారు. ఆమె వెంట స్త్రీనిధి మేనేజర్ సుధాకర్, ఏపీఎం గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన ఆర్ఐవో

మెరకముడిదాం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):మెరకముడిదాం కేజీబీవీని ఇంటర్మీడియట్ విద్య ప్రాంతీయ తనిఖీ అధికారి ఎస్.తవిటినాయుడు శనివారం సందర్శించారు. కేజీబీవీలో ఉన్న ఇంటర్ విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలపై అవగాహన కల్పించారు. పాఠశాల రికార్డులు తనిఖీ చేశారు. ఆయన వెంట పాఠశాల ఎస్వో బేగం ఉన్నారు.

ఉద్యానవన పంటలు మేలు

కొత్తవలస, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యానవన పంటలతో రైతులకు ఎక్కువ ప్రయోజనం ఉంటుందని ఆ శాఖా అధికారి పి.పద్మ అన్నారు. శనివారం దెందేరు, వీరభద్రపురంలో ఉద్యానవన శాస్త్రవేత్త శ్రీనివాసరాజుతో కలిసి రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మామిడి, జీడిమామిడి, బొప్పాయి, పూలు, కూరగాయల పంటల ద్వారా ఎలా ఆదాయం పొందాలో వివరించారు. మామిడిలో పూత, పిందె సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రసాయన ఎరువులు వాడకాన్ని తగ్గించి జీవ ఎరువులు వాడుకోవాలని సూచించారు. అంతర పంటలుగా అనాస, పెసర, మినుములు వేసుకుని దిగుబడి పొందాలని అన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

గరివిడి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కోనూరు అగ్ని ప్రమాద బాధితులను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు శనివారం పరామర్శించారు. బాధితులు నంబూరి గోపి, సీహెచ్ మహాలక్ష్మి, రెడ్డి సాంబ, ఎం.లక్ష్మికి నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం నుంచి శాశ్వత గృహాలు మంజూరయ్యేలా కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బలరాం, సురేష్‌కుమార్, రమణమూర్తి పాల్గొన్నారు.

చిరుధాన్యాలు పండించండి

లక్కవరపుకోట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో రాగులు, కొర్రలు, అండు కొర్రలు, సామలు, ఊదలు, సజ్జలు పండించాలని ఏవో హరికృష్ణ శనివారం రైతులకు తెలిపారు. రైతులెవరూ వరివైపు దృష్టి సారించరాదని, మిలెట్స్ పంటలు అత్యంత లాభదాయకమని పేర్కొన్నారు. వీటితో పాటుగా మినుములు, పెసలు, ఉలవలు, కందులు, బొబ్బర్లు, అనువులు, కొమ్ము శెనగ, వేరుశనగ పంటలు పండించి లాభం పొందాలని సూచించారు. మార్కెట్‌లో మిలెట్స్‌తో పాటుగా అపరాలకు, శెనగలకు డిమాండ్ ఉందన్నారు. మిలెట్స్‌కు పెట్టుబడి అవసరం లేదన్నారు. వ్యవసాయ శాఖ రాయితీపై విత్తనాలు అందిస్తుందని తెలిపారు.

సర్వేకు సహకరించాలి

రాజాం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి సర్వేకు ప్రజలు సహకరించాలని బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారి సిద్దేశ్వరి కోరారు. శనివారం ఆగూరులో సర్వే చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజరు ఎస్ఎస్ కిరణ్‌కుమారి, శశికుమారి తదితరులు పాల్గొన్నారు

తడి, పొడి చెత్తను వేరు చేయాలి

రాజాం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చెత్త సంపద కేంద్రాల వద్ద తడి, పొడి చెత్తను వేరు చేసి ఎరువుగా తయారు చేయాలని డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీనివాసరావు క్లాప్ మిత్రలను ఆదేశించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల వద్ద తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వడానికి మహిళలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సంపద కేంద్రాల వద్ద ఈ పని చేయాలని క్లాప్ మిత్రలకు సూచించారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

విజయనగరం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. ఈ నెల 24న ఎమ్మెల్యే అదితి పుట్టిన రోజును పురస్కరించుకుని విజయనగరం నగర, మండల పార్టీలు, అనుబంధ సంఘాలు, వివిధ స్వచ్ఛంద సంస్థలతో కలిసి శనివారం పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఆమె ప్రారంభించి రక్తదాతలను అభినందించా రు. ప్రతి ఏటా తన పుట్టిన రోజుని పురస్కరించుకుని రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించడం హర్షనీయమని అన్నారు. విద్యార్థులు రక్తదానం చేశారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే అదితి

ఉద్యోగులు ఐక్యతతో పనిచేయాలి


మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని శాఖల సంఘాల నాయకులు, ఉద్యోగులు ఐక్యతతో పనిచేయాలని రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం రెవెన్యూ హోంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం, హక్కుల సాధనే ప్రధాన లక్ష్యంగా ఏపీ జేఏసీ పనిచేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమస్యల పరిష్కారానికి సానుకూలంగా ఉన్నారన్నారు. ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావల్సిన బకాయిల సాధనకు కృషి చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో జేఏసీ భాగస్వామ్య సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కార్తీక సమారాధన

విజయనగరం టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగర శివార్లలోని తోటలో ఏపీడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టుల కార్తీక వన సమారాధన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాత్రికేయ వృత్తి సమాజంలో ఎంతో విలువైనదన్నారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నాగావళిలో మృతదేహం లభ్యం

కొమరాడ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత నిలమ్మలపాడు వద్ద నాగావళి నదిలో ఓ మృతదేహం లభ్యమయ్యింది. కొమరాడ ఎస్ఐ కె.నీలకంఠం కథనం మేరకు.. కొమరాడ మండలంలోని కళ్లికోట వద్ద గురువారం నాగావళి నది దాటుతుండగా కురుపాం మండలంలోని బియ్యాలవలస గ్రామానికి చెందిన మండంగి అన్నపురాయుడు గల్లంతయ్యాడు. మూడు రోజులుగా పోలీస్, అగ్నిమాపక సిబ్బంది, నాగావళి నదిలో వెతకారు. అయితే శనివారం పాత నిలమ్మలపాడు నది ఒడ్డున మృతదేహం లభ్యమయ్యింది. మృతదేహానికి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం తరలించి బంధువులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదుచేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గజపతినగరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మధుపాడ పరిధిలో జాతీయ రహదారిపై శనివారం జరిగిన ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ కిరణ్‌కుమార్‌నాయుడు తెలిపిన వివరాల మేరకు.. దత్తిరాజేరు మండలం కొమటిపల్లికి చెందిన వెల్లుర్తి దుర్గాప్రసాద్, మెంటాడ మండలం వనిజ గ్రామానికి చెందిన గుమడాం కిరణ్ ద్విచక్ర వాహనంపై కోమటిపల్లి నుంచి గజపతినగరం వస్తుండగా విజయనగరం నుంచి పార్వతీపురం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో దుర్గాప్రసాద్, కిరణ్ గాయపడ్డారు. కిరణ్ కుడి కాలు విరిగిపోయింది. వీరిని 108 వాహనంలో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

232 మద్యం సీసాల ధ్వంసం

పాలకొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాలకొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పట్టుకున్న 25 సారా కేసుల్లో సీజ్ చేసిన 636 లీటర్ల సారా, బెల్ట్ కేసుల్లో పట్టుబడిన 232 మద్యం సీసాలను శనివారం ధ్వంసం చేశారు. వీటిని పార్వతీపురం మన్యం జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిం టెండెంట్ ఎ.సంతోషి ఆధ్వర్యంలో సీఐ కె.సూర్యకుమారి పర్యవేక్షణలో ధ్వంసం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు ఎల్.తిరుపతిరావు, జి.ఫణీం ద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పది లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

గుమ్మలక్ష్మీపురం/కురుపాం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్టజమ్ము జంక్షన్ వద్ద సవరకోటపాడుకు చెందిన కద్రక రామన్న వద్ద పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు ఎక్సైజ్ సిబ్బంది ఆయ నపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అలాగే సవరకోటపాడులో సారా అమ్మకాలతో సంబంధమున్న అదే గ్రామానికి చెందిన కద్రక నీలమ్మపై కూడా కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఆమెను త్వరలో అరెస్టు చేస్తామన్నారు. దాడుల్లో ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో ఎనిమిది మంది..

బొబ్బిలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టిడ్కో కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లల్లో తాళాలు పగులగొట్టి విద్యుత్ వైర్లు, ప్యానెల్‌బోర్డుల చోరీ కేసుకు సంబంధించి ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు సీఐ కటకం సతీష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత జరిగిన ఈ చోరీపై కాంట్రాక్టరు ప్రతినిధి బుక్కురు గణేశ్ శనివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ ఆర్.రమేష్ కేసు నమోదు చేసినట్లు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. చోరీకి పాల్పడిన మర్రి నాని, చెరుకుబిల్లి రాము, మణికల అప్పుడు, పిరిడి రాజేశ్,పిరిడి చంటిలతో పాటు వారి వద్ద నుంచి దొంగ సొత్తును కొనుగోలు చేసిన గెంబలి సురేష్, నారంశెట్టి మల్లికార్జునరావు, రేజేటి భద్రయ్యలను కూడా అరెస్టు చేశామని సీఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

డెంకాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి ఐదు రోజుల జైలు శిక్ష, ముగ్గురికి రూ.10వేలు, రూ.30వేలు చొప్పున జరిమానా విధిస్తూ విజయనగరం ఎక్సైజ్ కోర్టు శనివారం తీర్పు చెప్పినట్లు ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు. బంటుపల్లిలో పలుచోట్ల సీసీ కెమెరాలు అమర్చినట్లు చెప్పారు.

●రేగిడి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో కొండవలసకు చెందిన తుమ్మి లక్ష్మంనాయుడుకు శనివారం రాజాం జ్యూడిషయల్ మేజిస్ట్రేట్ కోర్టు మూడురోజుల పాటు రిమాండ్ విధించిందని ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. లక్ష్మంనాయుడు మద్యం సేవించి వాహనం నడుపుతుండగా పట్టుకున్నట్లు చెప్పారు. ఆయన్ను కోర్టుల్లో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

భోగాపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ముంజేరు పంచాయతీ సిద్ధర్థా కాలనీలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుపై ఎస్సీ, ఎస్టీ సెల్ ఇన్‌చార్జి, విజయనగరం డీఎస్పీ ఎం.వీరకుమార్ శనివారం విచారణ చేపట్టారు. సిద్ధర్థా కాలనీలో మురుగు కాలువ తవ్వే విషయంలో ఆ కాలనీ వాసులకు, ముంజేరు గ్రామస్థుల మధ్య ఈనెల 20న ఘర్షణ చోటు చేసుకుంది. దీనికి సంబంధించి సిద్ధర్థా కాలనీకి చెందిన బోనెల గాయిత్రి, తదితరుల ఫిర్యాదు మేరకు 18 మందిపై సీఐ కె.దుర్గాప్రసాదరావు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ మేరకు డీఎస్పీ. సిద్ధర్థా కాలనీకి వెళ్లి ఫిర్యాదుదారులను విచారించి వారి వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. త్వరలో ముంజేరు కార్యదర్శిని కూడా విచారణ చేయనున్నట్లు సమాచారం.

సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరి


చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

రేగిడి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలని, హెల్మెట్ వినియోగంతో సురక్షిత ప్రయాణం సాధ్యమని ఎస్ఐ బాలకృష్ణ అన్నారు. రోడ్డుభద్రత, హెల్మెట్ వియోగంపై శనివారం ర్యాలీ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం, లచ్చరాయపురం మీదుగా ర్యాలీ సాగింది. కార్యక్రమంలో స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసులు, వాహనదారులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ, డీఎస్ఎన్ఎల్‌యూ ఒప్పందం

విజయనగరం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ, దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ (డీఎస్ఎన్ఎల్‌యూ) మధ్య కృత్రిమ మేధస్సు, టెక్నాలజీ చట్టం అంశాల్లో పీజీ సర్టిఫికెట్ కోర్సు కోసం ఒప్పందం కుదుర్చుకున్నాయి. జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ వీసీ సుబ్బయ్య, డీఎస్ఎన్ఎల్‌యూ వైస్‌చాన్సలర్ డి.సూర్యప్రకాష్‌రావు సంతకాలతో పరస్పరం ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఈతరహా కోర్సు ఇదే మొదటిదన్నారు. దేశ వ్యాప్తంగా ఇలాంటి కోర్సులు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. విద్యార్థుల, ఉద్యోగుల అవకాశాలను, న్యాయ వృత్తి నిపుణులను, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించడంలో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన 'జిందాల్'

ఎస్.కోట రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బొడ్డవర ప్రాంతంలో కంపెనీ ఏర్పాటు పేరుతో స్థానిక రైతులను జిందాల్ యాజమాన్యం మోసం చేసిందని నిర్వాసితులు అన్నారు. తమ భూములు తమకు అప్పగించాలంటూ వారు చేపడుతున్న నిరసన కార్యక్రమం శనివారం నాటికి 161రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిందాల్ యాజమాన్యం జీవో నెంబర్ 892పేరుతో రైతులను ఎలా మోసం చేసిందో ప్రభుత్వం విచారణ నిర్వహిస్తే వాస్తవాలు బయటపడతాయని అన్నారు. తమకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని తెలిపారు.


నినాదాలు చేస్తున్న జిందాల్ నిర్వాసితులు